# 18. అపరాధం

'నీకేమిరా! లక్ష రూపాయిల ఆస్తి వుంది... మంచి చదువు వుంది. ఉద్యోగం చేసి బతకక్కర్లేదు. హాయిగా జీవితాన్ని గడుపుతావు' అంటాడు ప్రతి స్నేహితుడూను!

నిజమే- డబ్బుతో లోకంలోని సౌఖ్యాలన్నిటినీ కొనలేమని ఎవరూ ఆలోచించరు. సౌఖ్యానికీ, డబ్బుకూ వున్న లంకెను గోరంతలు కొండంతలుగా చేసి చూసేవాళ్లే కాని నా నిజస్థితి యెవరికీ అర్థమై వుండదు. నా స్థితిని తెలుసుకునేందుకు నాకే మూడు సంవత్సరాలు పట్టిందంటే ఇంక ఇతరుల మాట ఏం చెప్పాలి? తలనెప్పితో బాధపడేవాడు తలనెప్పి లేని ప్రతి ఇతర మానవుడూ సుఖంగా ఉంటున్నాడని అనుకుంటాడు. అలాగే నా జీవితానికేమీ లోటు లేదని ఇతర బంధుమిత్రులు అభిప్రాయపడటంలో ఆశ్చర్యం లేదు!

వాతావరణాన్ని మార్చటంవల్ల కొంత మనశ్శాంతి ఏర్పడుతుందేమోననే ఆశ లేకపోలేదు. మనస్సు దేనికై పరితపిస్తూ వుందో తెలుసు కోగలిగేటప్పటికే, చాలా కాలం వృథా అవుతోంది. దాన్ని అది తెలుసుకోలేనంత వరకూ మనస్సును ఇతరత్రా తిప్పటంవల్ల కొంతవరకూ ఈ బాధను మాపుకోవచ్చు.

ముఖ్య స్నేహితుడు దాసుతో గడప సాగాను. వాడూ అదే మాట అంటాడు. 'నీకేంలోటు?' అని. నా కేమీ లోటులేనట్టే చిన్నగా నవ్వి గమ్మున ఊరుకుంటాడు.

చాలా కాలంగా నాలోని దైన్యాన్ని దుఃఖాన్ని కనిపించని బాధను వాడు గ్రహిస్తూనే ఉన్నాడు. ఎన్ని రకాలుగా వాడు నన్ను అడిగినా నేనేమీ చెప్పలేక పొయ్యాను. నాకైనా తెలుస్తేగా చెప్ప గలిగేందుకు? కాని వాడనుకున్నాడు- నేనేదో జీవిత రహస్యాన్ని తన నుంచి మరుగుపరిచి నాకు నేనుగానే బాధపడుతున్నానని! అందుకనే వాడు క్రొత్తరకం అస్త్రాల్ని నా మీద ప్రయోగించసాగాడు.

"నిన్నేదో మనోవ్యధ పీడిస్తోందని నాకు తెలుసు. మనస్సు ఆ బాధతో పాడుచేసుకోక - వేరే బాధకన్నా గురి చెయ్యటం కొంత వరకూ మంచిది" అన్నాడు వాడు.

"కొత్త బాధా? ఏమిటది?"

"ఏదో వొకటి. నీ యీడులో నీకో స్త్రీ అవసరం అనిపించటంలా?"

నాకు నిజమే ననిపించింది.

"ఏం చెయ్యమంటావు?"

"పెళ్ళి చేసుకోరాదూ?"

నా పెళ్ళి రహస్యం వాడికీ తెలియక ఈ మాట అని ఉంటాడు. లేక తెలిసినా, తనకు తెలిసినట్లుగా మాట్లాడటంవల్ల నేను బాధ పడతానేమోనని- ఆ విషయం తనకు తెలియనట్లుగానే నటిస్తున్నాడేమో? నిజం తెలిపేందుకు నాకూ ఇష్టం లేదు. అది చెప్పటంవల్ల నా పుండును నేనే కెలుక్కున్నట్టవుతుంది.

"పెళ్ళి నాకు ఇష్టం లేదు" అన్నాను.

"పోనీ ఎవర్నన్నా ఉంచుకో."

"ఊఁహూ."

"అసలొకసారి స్త్రీతో స్నేహంచేసి చూడరాదూ?"

"ఎట్లా?"

"ఎట్లాగేమిటి? డబ్బు పారేస్తే ఈ దేశంలో స్త్రీలకేం తక్కువ?"

స్త్రీలు ఇంత చౌకగా, తేలిగ్గా అమ్ముడుపోతారని నేనెప్పుడూ అనుకోలేదు. ఇందులో నిజం ఉండి వుంటుంది. అందుకనే డబ్బున్న నన్ను అందరూ అంత గొప్పగా, అన్ని కోర్కెల్నీ తీర్చుకోగల వ్యక్తిగా చూస్తూండి వుంటారు. ఐతే ఈ రకంగా తిరిగే స్త్రీలు చాలా చెడిపోయి, అసలు స్త్రీత్వమే లేకుండా ఉంటారేమోననే కొత్త అనుమానం కలిగింది. తేలిగ్గా దొరికే ఏ వస్తువు మీదైనా ఇలాటి తేలిక అభిప్రాయమే కలుగుతుందేమో?

"ఆ వ్యభిచారుణులేగా?"

"ఏం వాళ్ళలో మాత్రం మంచివాళ్లు లేరనుకున్నావా? సంసార స్త్రీలను మరిపించేవాళ్లున్నారు."

"ఉండి- డబ్బుకోసం...?"

"ఔను, డబ్బు కోసమే!"

నాకు ఆతృతకన్న కుతూహలం హెచ్చింది. నిజంగా అంత మంచివాళ్ళెవ్వరూ డబ్బుకోసం యీ పాడుపని చేస్తారని నేను ఎప్పుడూ ఊహించనైనా ఊహించ లేదు.

"ఐతే అంత మంచివాళ్ళు ఉన్నారన్న మాట?"

"చూద్దువు గాని-"

"సరే-"

"రాత్రికే పిలిపిస్తాను."

నేను ఆ మంచి వాళ్లను గురించి, అనేక విధాలుగా ఊహించుకొని ఇతర లోకాల్లోకి దొళ్ళిపోయాను.

❋ ❋ ❋

చీకటి పడేప్పటికల్లా ఆ ఉద్రేకమంతా తగ్గిపోయింది. ఆ విషయాల్ని తిరిగి దాసు ప్రస్తావించక పోవటమూ, నాకేమో సిగ్గుగా భయంగా వుండి ఊరుకోవటమూ, కొంతకాలం గడిచి పోవటమూ దీనికి కారణాలు.

తొమ్మిదయ్యే టప్పటికల్లా జట్కావచ్చి ఇంటి ముందు ఆగింది. బ్రహ్మచారి దాసుగాడింటికి స్త్రీ రావటం నా కాశ్చర్యంగానే వుంది. ఆమె కదలి వెల్తురు లేని ప్రదేశంనుంచి మెల్లిగా యీ ఇంట్లోకే రావటం వల్ల- నాకు గాను దాసుగాడు యీమెను దింపాడేమోననే అనుమానం నా మనస్సులో మెరిసింది.

ఆ మెరుపు కాంతి నా హృదయాన్నంతట్నీ ఇట్టే వెలిగించింది. నా ప్రథమ అనుభవాన్ని గూర్చిన తీయని తలపులన్నీ ఇట్టే ఆవరించినవి... కాని ఆమె దాసుగాడి కోసమే రాలేదుకదా!

దాసు లేచి వెళ్ళి ఆమెను ఆహ్వానించాడు. దక్షిణపు వైపు గదిలోకి తీసుకు వెళ్ళాడు. ఏదో సన్నగా, వినపడీ వినపడకుండా మాట్లాడుతున్నారు. నన్ను అన్యాయం చేసి, ఒంటరిగా వొదలి వెళ్ళిన దాసుగాడ్ని ఏం చెయ్యాలో నాకు అర్థం కాలేదు. నేను కూడా ఆ గదిలోకి వెళ్దామా అంటే- నాగరికత వొకటి అడ్డంగా నిలబడ్డదాయె!

పది నిమిషాలకల్లా దాసు నవ్వుకుంటూ వొచ్చాడు. నా ముఖంలోని ఆతృతను ఎక్కడ కనిపెట్టి నన్ను 'లూజ్ కారెక్టర్'గా పరిగణిస్తాడోనని పిసుక్కు ఛస్తున్నాను.

అన్నాడు "ఇక పోరా! నేను సినిమాకు వెళ్తాను" దాసు.

"ఏం?" అన్నాను, వాడు వెళ్ళిపోవడమే నాకు ఇష్టం ఐనప్పటికీ.

"మధ్య నే నెందుకూ పానకంలో పుడక లాగు? వెళ్లేప్పుడు ఆమె కొక యాభై ఇవ్వు-"

ఇంతేనా అనిపించింది. తలూపాను.

దాసు ఆ జట్కాలోనే వెళ్ళిపొయ్యాడు.

❋ ❋ ❋

కార్యం గదిలోకి వెళ్ళే పెళ్లి కూతురల్లే నా కెంతో సిగ్గుగా వుంది. కాని ఆమెకు లేని సిగ్గు నా కెందుకు? అదీ కాక అనుభవంలేని నన్ను అనుభవం వున్న ఆమె ఆదరించ గలుగుతుంది. కొంపంతకూ మే మిద్దరమే కనుక నేను ధైర్యాన్ని పుంజుకున్నాను.

నేను వెళ్ళగానే కుర్చీలో కూర్చున్నదల్లా లేచి నిలబడి, ముఖం గోడవైపు తిప్పింది. నేనైనా, దాసుగాడైనా ఇంకెవరైనా ఆమెకు పనిలేదు. ఆమె చూడవలసిన అవసరం కూడా లేదేమో?

పురుషుణ్నయిన నాకు మాత్రం ఆ అవసరం వుంది. నేను కొనుక్కునే వాణ్ని. సరుకు నాణ్యం కానిదే నాకు దేనికీ?

దగ్గరకు వెళ్లి భుజం మీద చేయిచేశాను. ఆమె శరీరమంతా గగుర్పాటుకు గురైంది. కొంత కుంగుదల కూడా వొచ్చిందేమోనన్న అనుమానం నాకు కలిగింది.

"నీ పేరేమిటీ?" అన్నాను.

ఆమె జవాబు చెప్పలేదు. సిగ్గు పడుతోంది. ఆమె సిగ్గు నాలో ఆమె మీదున్న అన్ని నీచాభిప్రాయాలనూ కడిగి వేసింది.

ఆమెను బుజ్జగించాను. ఉద్రేకాన్ని బలవంతాన ఆపుకుంటూ ఆమెను సంభాషణలోకి దింపాను. మొదట్లో బెట్టుచేసినా ఆమె క్రమంగా లొంగిపోయింది.

"నీ పేరు చెప్పవా?"

"శారద."

ఆ పేరు నా కెంతో ఇష్టమైంది. ఆ పేరున్న వ్యక్తుల్ని చూస్తే నే నెంతో భయపడతాను; ఉద్రిక్తుణ్నవుతాను. కాదు - కుంగిపోతాను. అదీ కాదు... అన్ని రకాల రసాలు ఒక్కసారిగా నాలో పని చేస్తవేమో ననుకుంటాను.

ఆమె అందమైనదే! అంతకన్న నేను అనుకున్నట్టుగా ఆమె బజారురకం కాదు. సంసార పక్షంగా వుంది. నాతో అరమరికలు లేకుండా ఇట్టే కలిసిపోయింది.

❋ ❋ ❋

యవ్వనోద్రేకం అంతా తగ్గిపోయింది. ఇంతకు ముందు చక చకా సాగిపోయిన కాలం క్షణం క్షణంగా జరుగుతూ వుంది. ఒక వైపున తెల్లారిపోతోందనీ, ఆమె వెళ్ళి పోతుందనీ, మళ్ళీ ఇలాంటి సందర్భం వొచ్చేందుకు మరి కొంతకాలం కావలసి వుంటుందనీ ఒక పక్క బాధగానే వుంది. కాని 'కోర్కె' ఉండటం వేరు. దాన్ని తీర్చుకో గలగటం వేరు.

ఆమెతో ఏదో మాట్లాడుతున్నాను. ఇంత మంచి పిల్ల యీ వ్యభిచార వృత్తికి దిగిందేమా అన్న అనుమానం వేసింది. ఆమె వ్యభిచారిణి కాక పోయినట్లయితే నాకు అందుబాటులో ఉండేది కాదనే విషయం అప్పుడు నాకు జ్ఞాపకం రాలేదు.

"ఇలా సంపాయించక పోతే- పెళ్లి చేసుకోకూడదూ?"

"నాకు పెళ్లవలేదని ఎవరన్నారు?"

"మరి ఆ భర్తతో హాయిగా, కాపరం చెయ్యక-?"

"ఆ భర్తకు నేను అక్కర్లేక పొయ్యాను."

"ఒక్క రాత్రికే నన్నింత ఆనంద పరిచావే - ఆ భర్తగాడు నిన్నెట్లా వొదిలి పెట్టాడో అర్థం కావటం లేదు!"

"అసలు ఆయనతో కాపరం చెయ్యలేదు. అసలు ఆయన ఎలా వుంటాడో కూడా నాకు తెలియదు."

"విచిత్రంగా వుందే!"

ఆమె మాట్లాడకుండా 'ఔను' అన్నట్టు ఊరుకుంది.

నాకు తెలియకుండానే ఆమె మనసును బాధపెట్టే విషయాన్ని కెలికినట్టున్నాను. ఆమె ముఖంలోని బాధా, దీనత్వమూ, నాకీ అభిప్రాయాన్ని కలిగించినవి. ఐనప్పటికీ ఆమె విచిత్రగాథను వినాలనే నా కుతూహలం తగ్గ లేదు.

"అదేమిటో నాకు చెప్పవూ?" అన్నాను బతిమాలుతూ.

"పోనిద్దురూ-" అంది... తను లెక్క చేయనట్టు.

"వినాలని వుంది-"

ఆమె ఒక క్షణం నా కళ్ళల్లోకి చూసింది. నా కుతూహలాన్ని గ్రహించిందనుకుంటాను-

"అదంతా వింటూ కూర్చుంటే తెల్లారుతుంది" అంది- వినటం కన్న ఇంకో విధంగా కాలాన్ని సద్వినియోగం చెయ్యమనే హెచ్చరికనిస్తూ. కాని నాకేమో నే నెరగని ఆమె భర్త మీద యెంతో కోపమూ, శారద మీద యెంతో సానుభూతీ కలిగినవి.

అందుకనే "తెల్లారినా ఫర్వాలేదు" అన్నాను. వ్యర్థమయ్యేది నా కాలమేననే కంఠస్వరంతో.

"అంత గొప్ప కథేమీ కాదులెండి..." ఆమె చెప్ప నారంభించింది.

"ఆయనకు పెద్ద ఆస్తి వుంది. చదువుకున్నారు కూడాను. ఎప్పుడో చిన్నతనంలో నాకు పెళ్ళయింది. కాని నాకు బుద్ధి తెలిశాక, ఆయన్నెప్పుడూ చూడలేదు. నేను పెద్దదాన్నయాను. నాయీడు పిల్లలందరూ, తల్లు లవుతుండగా నేను పుట్టింటనే ఉండిపోవల్సివచ్చింది..."

"ఎందుకని?"

"పెళ్ళికట్నం తాలూకు నాలుగువేల రూపాయలూ, మానాన్న ఇవ్వలేదని ఆయన కార్యం చేసుకోకుండా ఊరుకున్నారు- నాన్న అంత డబ్బు ఇచ్చే స్థితిలో లేడు... ఎన్నాళ్ళో యెదురు చూశాను. నా ఆశలు ఏ విధంగానూ తీరేవిగా తోచలేదు. నా సమస్యను నేనే పరిష్కరించుకోవాల్సి వొచ్చింది. ఇక వేరు మార్గం లేక – పెళ్లి లేకుండానే ఇంకో భర్తతో లేచి వొచ్చేశాను..."

నా కుతూహలం సగానికి పైగా చచ్చింది. ఈ గాథ ఒక విధంగా నన్నే బాధిస్తూవుంది. కాని ఒక కొత్త అనుమానం నన్ను పీడించసాగింది.

"పోనీ యీ కొత్త భర్తతో సరిగ్గా ఉండలేక పొయ్యావా?"

"ఆయనకు ఉద్యోగం లేదు. ఎవ్వరూ ఆయన చేత పని చేయించుకునేవాళ్లు కూడా కనిపించటం లేదు. నాకేమో ఆయన కావాలి. ఆయన నన్ను పోషించలేడు. కాని ఆయన్ను పోషించగల ఉపాయమిదొక్కటే. నేనేం చేసేది? ఆయనకు తెలుసు. తెలిసినా మెదలకుండా ఊరుకుంటారు."

ఔను. అంతకన్న ఎవరేం చేయగలుగుతారు? నాలుగు వేల రూపాయల కోసం నాలుగేళ్ళక్రితం నే నీమె జీవితాన్ని నాశనం చేశాను, కాదు... నా జీవితాన్నే నాశనం చేసుకున్నాను.

ఈమెను లేచిపోయిన నా భార్యగా కనుక్కున్న ఆ క్షణాన్నే నాకు ఆమె మీద, ఆమె భార్యగా ఉన్నప్పటి కోపం పోయింది. పైగా ఒక రకం సానుభూతి ఏర్పడింది. ఆమెకు నా సంగతి చెప్పటం చాలా అనవసరం. ఆమె మరింత బాధకు గురవుతుందేమో?

"వెళ్దామా?" అన్నాను.

"మీ ఇష్టం."

పర్స్‌తీసి యిచ్చాను. "మీరే ఇవ్వండి" అంది.

"తీసుకో" అన్నాను.

పర్సు విప్పి "ఇదంతానా?" అంది.

"ఔను–"

"నిజంగానా?"

"అబద్ధమేముంది?"

ఆమె కళ్ళు మెరిసినవి. నమస్కరించింది. జట్కాదాకా వెళ్ళి సాగనంపాను– ఆ పర్సులోని పైకం నేను యీ సంఘానికి చెల్లించిన అపరాధం– నాలుగువేల రూపాయలు!

– జనవరి 1949